# తూరుపు

'ఆ ఇల్లే, సీకటి సీకటి గున్నాదే ఆ ఇల్ల. బుడ్డీ దీపమున్నాది సూడు —దాని పక్క ఇల్లు.' అని గుర్తులు చెప్పి, చేత్తో చూపించి, 'తెలిసిందా?' అని అడిగి, తెలిసిందని కొండడు తలూపిన తర్వాత తన దారిన వెళ్లిపోయాడు ఆ పెద్దమనిషి. కొండడు బస్సు దిగేసరికే పొద్దు మునిగి చీకటి పడింది. దానికి తోడు వాన. రోడ్డుకు దాదాపు కిలోమీటరు దూరంలో చెల్లెలి అత్తవారి ఊరు ఉన్నట్టు తండ్రి చెప్పాడు. రోడ్డుకు పడమర దిక్కుగా పొలాల మధ్యనించి గట్టుదారిన వెళ్లాలన్నాడు. ఇప్పుడు చీకట్లో బస్సుదిగేసరికి వాన. దాంతో ఏది పడమరో ఏది తూర్పో కూడా తెలియలేదు. దారి వెతుక్కుంటుంటే తనతోపాటే బస్సు దిగిన ఆ ఊరు మనిషే దొరకటంతో ఆ చిక్కు విడిపోయింది. ఊళ్లో ఆ ఇంటి వరకూ వచ్చి ఆ పెద్దమనిషి ఇల్లు చూపించి తన దారిన వేరే వీధికి వెళ్లిపోయాడు.

దారి పొడుగునా తన గురించి ఆ పెద్దమనిషి అన్ని వివరాలూ అడిగాడు. కాలు జారుతున్న పొలం గట్ల మీద చెప్పులు తీసేస్తేనే తప్ప నడవలేకపోయాడు కొండడు. మధ్యన ఒకటి రెండు చిన్న చిన్న కాలవలు. ఆ పెద్ద మనిషి పట్ల కొండడికి గౌరవం కలిగింది.

గొడుగు ఉన్నా తడిసి పోయాడు కొండడు. గాలికి గొడుగు ఊగి పోతున్నది.

ఆ చెప్పిన ఇంటి ముందుకు వచ్చి లోపలకి చూస్తే బుడ్డిదీపం మసక వెలుతురు తప్పించి ఇంట్లో మనుషుల సందడి కన్పించలేదు కొండడికి.

'సాయిత్తిరీ' అని పిలిచాడు.

'వోరు?' అని చీకటిలోంచి ఆడమనిషి ముసలి గొంతు వినిపించింది. ఎంత వెతికినా చీకట్లో ఆ మనిషి మాత్రం కనిపించలేదు.

'నేను సాయిత్తిరి అన్నని' అన్నాడు కొండడు.

తాటికమ్మల పైకప్పు మీద పడుతున్న వాన చప్పుడుకి తన మాట చెల్లెలికి వినిపించినట్టు లేదు.

'వోరు?' అని గట్టిగా మళ్లీ అదే గొంతు.

ముసలమ్మ సాయిత్తిరి అత్త అయి ఉంటుందనుకున్నాడు కొండడు.

'సాయిత్తిరి అన్నని అత్తా' గట్టిగా అన్నాడు కొండడు. ఇది తన చెల్లెలు ఇల్లే అని నమ్మకం కుదిరింది. లోపల గడపలోకి అడుగుపెట్టాడు.

'జగ్గన్నవా నాయనా. మాట గురుతుపట్లేక పోయినాను. రా నాయినా రా రా. సాయిత్తిరి పొరుగింటికెల్లింది. వస్తాది, కూకోనాయినా. వోన — వొకటే వోన. తడిసి పోయినావా?'

'గొడుగున్నాది గాని —గొడుగాగుతాదా అత్తా యీ వోనకి' అన్నాడు కొండడు. పొలంగట్ల బురదకి పాడవుతాయని పట్టుకున్న చెప్పులు కింద ఉంచాడు. గొడుగు ముడిచి చూరుకు వేలాడదీశాడు. చేసంచి అరుగుమీద గోడకానించి పెట్టాడు.

'కూకో నాయినా. మీ అమ్మా అయ్యా అంతా కమ్మగున్నారా నాయనా?'

'ఆఁ ఆఁ కమ్మగున్నారత్తా'

'నీ పిల్లలూ నీ పెళ్లామూ'

'జగ్గన్నని కాదత్తా సిన్నోడిని కొండడ్ని'

'సిన్నోడువా. జగ్గన్న వనుకున్నా నాయినా, మీ అన్నా మీ బొన్నీ, పిల్లలూ కమ్మగున్నారా నాయనా?'

'అంతా కమ్మగున్నారత్తా'

కొండడు చెల్లెలి కోసం వెతుకుతున్నాడు. చీకటి. వీధిలో మనుషు లెవరూ కనిపించటం లేదు. ఇళ్లల్లో మసక దీపాల గుడ్డివెలుతురు. ఇరుకు ఇరుకుగా తాటాకుల ఇళ్లు.

'దేశం నించి ఎన్నడొచ్చినావు నాయినా?'

చేసంచిలోని తువ్వాలు తీసి వొళ్లు తుడుచుకున్నాడు. తడిచిపోయిన చొక్కాని పిండి గాలికి ఆరటానికి వీలుగా చిలక్కొయ్యకి తగిలించాడు. తువ్వాలు కట్టుకుని విడిచిన పంచెను పిండుకున్నాడు. తడవకుండా చేసంచిలో దాచిపెట్టిన బీడీకట్ట, అగ్గిపెట్టె తీసి బీడీ వెలిగించాడు. నోటి నిండా వెచ్చని పొగపీల్చి వదిలాడు.

'నాల్రోజులయిందత్తా. సోమారం నాడొచ్చినా' అన్నాడు.

నెత్తిన నీళ్లకడవతో వానలో తడుస్తూ వచ్చింది సావిత్రి. గడపలో నిలబడి చీకటిలో బీడీ తాగుతున్న చిన్నన్నని ముందు పోల్చుకోలేకపోయింది.

'చెల్లీ' అని కొండడు పిలిస్తే 'సిన్నన్నా' అని తలమీద బరువు కడవతో అట్లాగే నిలబడిపోయింది ఒక చోట. 'మా సిన్నన్న వొచ్చినాడత్తా' అని చెప్పి నీళ్లకడవ దించుకుని లోపలికి వెళ్లింది. ముంతతో నీళ్లు పట్టుకుని వచ్చి 'కాళ్లు కడుక్కో' అని ముంత అందించింది. 'మా సిన్నన్నత్తా, దేశం నించొచ్చినాడు' అత్తకి మరొకసారి చెప్పింది.

ఆ ఇంట్లో ఓ మూల పొయ్యి ఉంది. ఆ పొయ్యికి దగ్గర్లోనే పెరటి ద్వారం. ఆ వెనక చిమ్మచీకటి. సావిత్రి ఆ ద్వారం దగ్గర నుంచుని చీర పిండుకుని గోడకి ఆర గట్టిన చీర తీసి మార్చుకుంది.

కొండడు కాళ్లు కడుక్కుని లోపలికి వచ్చాడు. తూర్పు గోడకానుకుని తుంగ చాపమీద నిద్ర పోతున్న అయిదారు నెలల పసిపాపని చూసి దగ్గరకు వెళ్లి కూర్చున్నాడు.

'నీ కూతురు తొంగొని ఎంతసేపయింది చెల్లీ. లేస్తాదా ఇప్పుడు' అని 'వొంటిమీద ఒక గుడ్డేనా కప్పినావు కాదు, సల్లేదా' అని తన తువ్వాలు కప్పబోయి, తడిసిందని ఆ పక్కనే పడున్న పొడిగుడ్డ తీసి పాప వొంటి మీద కప్పి, బుగ్గల్ని చేత్తో ముట్టుకుని, తడిమి ఆ పక్కనే కూర్చున్నాడు కొండడు.

ఊళ్లో అమ్మా అయ్యా సంగతులు తెలుసుకున్న తర్వాత 'పెద్దన్న ఎలాగున్నాడురా? ఆ మద్దిన పోలీసోళ్లు తీసికెల్లి కొట్టినారట' అని దగ్గరకు వచ్చి అడిగింది.

'యింకా నొప్పులున్నాయి. గుండె మీద కోడిగుడ్డు పట్టేసినారు. నూనెరాసి రోజూ కాపడం పెడతన్నారు. అప్పుడప్పుడు నోటినించి నెత్తురు పడతన్నాది. బైరాగితాత మందులిస్తన్నాడు. మనిసి లేసి ఆడి పనులు ఆడు సేసుకోడానికి రెండు మూడు నెలలయినా పడతాదిరా. పేనం దక్కింది. అమ్మోరుకి మొక్కుకోండి అన్నాడు బైరాగితాత. యీపంతా పులిసిపోయిన నొప్పులు.'

వంట కోసం పొయ్యి ముట్టించాలని వచ్చి పిడకలు తెచ్చి పెట్టి, అగ్గి పుల్ల గీసింది. ఇంటి నిండ పొగ. ఆ పొగకి కళ్లు మండుతున్నాయి. పొగకి అక్కడ కూర్చోలేక కొండడు బయటికి వచ్చాడు. బీడీ అయిపోయింది, పారేశాడు.

అడుగుల చప్పుడు, బీడీ పొగవాసన ముసలమ్మకు తెలిసింది.

'నాయినా, నీకాడ సుట్టుంతె ఇయ్యి నాయినా' అని చలికి చుట్ట అడ్డపొగ పెట్టుకోవాలని అనిపించి అడిగింది ముసలమ్మ.

'సుట్ట లేదత్తా. వూర్ల దొరుకుతాయా, ఎల్లి తెస్తాను' అని చుట్టలు ఎక్కడ అమ్ముతారో కనుక్కోవాలని పొయ్యి దగ్గర వంటపనిలో ఉన్న సావిత్రి దగ్గరకు వెళ్లబోయాడు.

పొయ్యి వెలిగింది. లోపలి పొగ ఇంకా తగ్గలేదు. తీరా పొయ్యి దగ్గరకు వెళ్లే సరికి ముందు టీ పెట్టించుకుని తాగాలనిపించింది. తను అస్సామ్ నించి తెచ్చిన చాపత్తి చెల్లెలికి ఇచ్చి 'చెల్లీ పొయ్యి ఎత్తిరించినావు కదా. నాకు ముందు చానీళ్లు కావాల. ఒక పక్క చాపెట్టు' అన్నాడు.

సావిత్రికి చిన్నన్న కొండడు మాటలు అర్థం కాలేదు. రెండున్నరఏళ్ల కిందట కొండడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా అస్సామ్ పారిపోయాడు. అక్కడకు వెళ్లిన తర్వాత వాడి మాట మారిపోయింది. సావిత్రి మారు పలక్కపోయే సరికి కొండడు తన భాష గుర్తుకొచ్చి 'ఇంట్ల టీ పొడుం ఉన్నాదా?' అన్నాడు.

సావిత్రి వెతుక్కుంటున్నది. టీ పొడుం లేదు. పాలు లేవు. బెల్లం ఉంది గాని సరిపోతుందో లేదో. మేష్టరు గారింటికి వెళ్తే దొరుకుతాయి. కాని వాన. ఈ చీరకూడా తడిసిపోతే మళ్లీ మార్చుకోటానికి ఏం లేదు. పగలంతా కూలికి వెళ్లి పొలంలో తడిసింది. ఇంటికి వచ్చి, కూతురుకు పాలు పెట్టి, వంట చేయబోతే నీళ్లులేవు. దగ్గర్లో ఉన్న పెద్దమ్మగారింటికి వెళ్లి నీళ్ల కడవ తెచ్చేలోపల మళ్లీ తడిసింది.

తడిపిడకలు. పొయ్యి ఆరిపోయింది. మళ్లీ పొగ. పొయ్యి రాజుకో వటానికి చేటతో గాలి వీస్తున్నది. కొండడు తన చేసంచి తీసుకుని వచ్చి పొయ్యి దగ్గర కూర్చుని, 'లెగు నేను చూస్తాను' అని చెల్లెలి చేతిలోని చేట తీసుకున్నాడు.

మంట రాజుకుంది.

'ఈ సెక్కమీద కూకో' అని చిన్న బల్లచెక్క అటు జరిపింది సావిత్రి.

సావిత్రి పొయ్యికి దగ్గర్లో కూర్చుంది.

సంచిలోంచి బిస్కెట్‌పాకెట్లూ, మిరాయిపొట్లమూ, తేయాకుమూట, ఒక్కొక్కటీ తీసి బైట పెడుతున్నాడు. పొయ్యి మీద ఓ పక్క బియ్యమూ, మరో పక్క టీ కోసం నీళ్లు

పెట్టింది సావిత్రి. కూర్చునే తనకు కావలసినవన్నీ పొయ్యి దగ్గర్లోనే ఉన్న పిడతల నించి, బుట్టల నించీ అందుకుంటున్నది.

కొండడు తేయాకు మూట విప్పాడు. పెద్ద పెద్ద ఆకులు నల్లగా. 'ఇది సానా మంచాకు. దొరలు తాగుతారు.' అని తను అస్సామ్ నించి చెల్లెలి కోసం తెచ్చిన తేయాకుని కొంచెం చేతిలోకి తీసుకుని సావిత్రి ముక్కు దగ్గర పెట్టాడు, వాసన చూడమన్నట్టు.

సావిత్రి తేయాకు వాసనచూసి 'కమ్మ గున్నాది' అంది. అంత మంచి తేయాకు ఆమె ఎప్పుడూ చూడలేదు. ఆమెకు ఈ ఆకు చూడటం ఇదే తొలిసారి.

'చీనీ ఉన్నాదా?'

'పంతులమ్మ కాడికెల్లి తెస్తాను'

'పోనీ బెల్లమున్నాదా?'

బెల్లం ఉన్నట్టు తెలిసి 'మరింకేం వొద్దు' అన్నాడు. మరొక బీడీ తీసి, కట్టె పుల్లతో వెలిగించుకున్నాడు.

'బావ ఎప్పుడన్నా వొస్తన్నాడా?' చెల్లెలుముఖంలోకి చూసి అడిగాడు కొండడు.

సావిత్రి మొగుడు వీరేశు నక్సలైట్లలో కలిసిపోయాడు. మొదట్లో మధ్య మధ్య ఇంటికి వచ్చి వారం పదిరోజులు ఉండి వెళ్లేవాడు. ఇంట్లో అడుగు పెట్టి ఇప్పుడు దాదాపు ఏడాది కావస్తున్నది. వరి కోతలప్పుడు వెళ్లిపోయినాడు. ఎరిగిన జనమేమో, వచ్చి పోతున్నాడు, మేం చూసాం అంటే మే చూసాం అంటున్నారు. ఇరుగు పొరుగు ఊళ్లల్లో కనబడ్డాడంటున్నారు. ఓసారి బస్సులో కనబడ్డాడట. అదే బస్సులో ఇద్దరు పోలీసులు ఒక దొంగను బేడీలు వేసి కోర్టుకు తీసుకువెళ్తున్నారట. ఈ సంగతులన్నీ కొండడు ఊళ్లో విన్నాడు. చెల్లెల్ని అడిగితే నిజమెంతో అబద్ధమెంతో చెబుతుందనుకున్నాడు.

'రాలేదు'

'కూతురు పుట్టిన తరాత కూడా'

'ఊహూఁ'

'మరి దొరికిన ప్రెతి నక్సలైట్‌నీ పోలీసులు కాల్చేస్తన్నారంట'

'ఆఁ'

'బావ బతికే ఉన్నాడా సాయిత్తిరీ'

'బతికున్నాడు' అంది సావిత్రి.

సిన్నన్న బీడీ పొగ వాసన సావిత్రికి మొగుడు వీరేశును గుర్తు తెచ్చింది.

పొయ్యి మండుతున్నది. ఆ మంటల ఎర్రటి వెల్తురు పడి వాళ్ల ముఖాలు మెరుస్తున్నాయి. ఓ పక్క వానగాలి చల్లగా. చూరునించి జారుతున్న వాన నీళ్ల చప్పుడు. పెరటి నించి వాన నీళ్లు పారుతున్న చప్పుడు. పొయ్యిమీద టీ కోసం పెట్టిన నీళ్ల కాగుతున్న సలసల. టీ వాసన, బెల్లం కలిపిన తీపి. ఆ వాసనలకి మళ్లీ మొగుడు మతి బడ్డాడు. తెల్లారకముందే డికాషన్ చేయించి పాలులేని నల్లని టీ తాగి పనిలోకి వెళ్లిపోయేవాడు.

కొండడు డికాషన్ వడబోసాడు. నల్లగా బెల్లం వాసనతో టీ, పాలు లేవు. వద్దన్నాడు. అత్తకిచ్చి వస్తానని ఒక గ్లాసులో తీసుకెళ్లింది సావిత్రి. బీడీ బైటికి పారేసి, మిగిలిన టీ గ్లాసుల్లో తనకీ చెల్లెలికీ సర్దాడు కొండడు.

చెల్లెలు తనకన్నా పెద్దదయి పోయినట్టు అనిపించింది కొండడికి. సావిత్రి పెళ్లికి ముందే కొండడు అస్సామ్ వెళ్లిపోయాడు. దాదాపు రెండున్నర ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి తిరిగి స్వగ్రామం రావటం. ఈలోపు సావిత్రికి పెళ్లయింది. ఇప్పుడు తల్లి అయింది. ఒక ఇంటికి పెద్ద అయింది. ముఖంలో చిన్నప్పటి మొద్దుతనం ఇప్పుడు లేదు. మొఖం తేటు తేలింది. కళ్లు విచ్చుకున్నట్టున్నాయి. అత్తగారింటి అనుభవాలో, భర్త వీరేశం ప్రభావమో చెల్లెలి చూపుల్లో చురుకుతనం కనిపిస్తున్నది.

సావిత్రి అత్తకి టీ ఇచ్చి వచ్చింది. కొండడు టీ చప్పరిస్తూ చెల్లెల్ని చూస్తున్నాడు. తడిసిపోయిన జుత్తు, చిన్నప్పుడు తగిలిన నుదుటి మీది గాయాల మచ్చలు, వానకి తడవటం వల్ల ముక్కు మీంచి కుడి బుగ్గ వరకు సాగిన కుంకుమ చారిక, మంట వెలుగులో చెల్లెలు తల్లిఅయినసొబగుతో, కొత్త అందాలతో కనిపిస్తున్నది.

అలా చెల్లెల్ని చూస్తుంటే ఆమె ఒంటరితనం గుర్తొచ్చి దుఃఖ మొచ్చింది కొండడుకి. టీ చప్పరిస్తూ చెల్లెలు ముఖంలోకి చాలాసేపు చూశాడు.

వేరే చట్టిలో నీళ్లు పోసి ఖాళీ అయిన రెండో ఆయిలం మీద పెట్టింది. ఒక పక్క ఎసరుకాగి అన్నం ఉడుకుతున్న వాసన. చింతపండు తెచ్చి నానబెట్టింది. అప్పుడు తీరిక చిక్కింది సావిత్రికి. టీ గ్లాసు నోటి దగ్గర పెట్టుకుని, కొంచెం తాగి,

'సిన్నన్నా, లగ్గం ఎప్పుడనుకుంతున్నార్రా?' టీ మరొక గుక్క మింగింది సావిత్రి.

'ఇప్పుడు నీ నొచ్చినాను యానికని? చెల్లినీ, ఇక్కడ మన బందుగుల్ని పిలుపులు చేసుకుని వొచ్చెయ్యిరా నాయినా అని అయ్య తోల్నాడు. అన్నకి వొళ్లు బాగుంతె అడిదే ఈ పెళ్లి పిలుపులు పని' అని కొండడు మధ్యలోనే ఆగిపోయాడు.

పెద్దన్న పోలీసులు కుళ్ల బొడిచిన ఒంటితో రెండు నెలలుగా పడి ఉన్నాడు. ఆ దెబ్బలు తిన్న కబురువిని సావిత్రి ఒక పూట వెళ్లి అన్నని చూసి రెండో పూట తిరిగి వచ్చేసింది. తన మొగుడు మూలంగా తన పెద్దన్నకు, తన కన్నవారికి వచ్చిన కష్టాలు గుర్తొచ్చినప్పుడల్లా సావిత్రి మనసు దుఃఖంతో కుంగిపోతుంది.

'ఎప్పుడు లగ్గం?'

'బుదోరం రాతిరి'

'బుదోరమా?'

పెళ్లికి ఇంకా నాలుగురోజులే మధ్యన. తను వెళ్తే ఇంటి దగ్గర ఒక్కతే అత్త. కళ్లు కనిపించవు. ప్రతి పనికి అత్తకి సాయం కావాలి. తోడుకావాలి. సావిత్రికి పెళ్లయి, ఈ ఇంట్లో అడుగుపెట్టిన తర్వాత కన్నవారింటికి వెళ్లటానికే కుదరటం లేదు. తండ్రి జబ్బు పడ్డాడని తెలిసినప్పుడొకసారి వెళ్లింది. వదిన నీళ్లాడిందని కబురు తెలిసినప్పుడొకసారి చూసి వచ్చింది. వీరేశు నక్సలైట్లలో కలిసిపోవాలని ముందే నిశ్చయించుకున్నాడో ఏమో, తల్లికి తోడుగా ఒక ఆడపిల్లను ఇంట్లో ఉంచాలనే పెళ్లి చేసుకున్నట్టుంది. అత్తని ఇంట్లో విడిచిపెట్టి ఎటెళ్లినా పొద్దోయికి ఇంటికి రావలసిందే.

సావిత్రి మధ్యమధ్య పొయ్యిలో పిడకలు పెడుతూ, వంటపని చేస్తూ టీ తాగుతున్నది. చిన్నన్నతో మాట్లాడుకుంటూనే తన పనులు తాను చేసుకుంటున్నది.

'అయితే సిన్నన్నా మల్లా దేశం ఎలిపోతావా పెళ్లయింతర్వాత? ఊళ్లోనే ఉండి పోరాదురా సిన్నన్నా' అని తన అభిప్రాయం చెప్పింది సావిత్రి.

'ఇక్కడుండి మల్ల కంబారితనం సెయ్యమంతావా?'

చెల్లెలి మాటకి కోప మొచ్చింది కొండడుకి. వాడికి కంబారితనం అంటే వెన్నులో భయం. ఇప్పుడు ఈ రెండున్నర ఏళ్లూ వాడు అస్సామ్‌లో కూలీగా కొత్త స్వేచ్ఛను అనుభవిస్తున్నాడు. దానికన్నా కిందమెట్టుకి దిగటం, కడుపునిండినా నిండకపోయినా వాడికిఇష్టం లేదు.

'సాయిని తీసికెల్లి పోతావా నీ తోటి?'

'పెళ్లయిన తర్వాత అది ఇక్కడ యానికి?'

సాయి సంబంధం కొండడుకి అవుతుందని ఎవరూ అనుకోలేదు. సాయి తండ్రికి గొర్రెల మంద ఉంది. నాలుగు గేదెలున్నాయి. అప్పులు లేవు. వాడి కొడుకు లెవ్వరూ కంబార్లు కారు. ఒకడు గేదెలు చూసుకుంటాడు. రెండోవాడు కూలిపనులు చేసుకుంటాడు. సాయితండ్రి గొర్రెల మంద చూసుకుంటాడు.

మరి కొండడు తండ్రికి ఒక చిన్న తాటాకుల ఇల్లు, రెండు మేకలు తప్ప వేరే

ఆస్తిలేదు. రెండేళ్ల కిందటి దాకా సావిత్రి పెద్దన్న జగ్గన్న ఊళ్లో ఒక రైతు దగ్గర కంబారితనం చేశాడు. సావిత్రి తండ్రి ఇప్పటికీ కంబారితనంతోనే బతుకుతున్నాడు. బుగత ఒకరోజు వీపు పగిలిపోయినట్టు కొట్టాడనీ, ఇంకా ఉంటే తనని కొట్టి కొట్టి చంపేస్తాడనే భయంతో కొండడు, తెలిసినవాళ్లు అస్సామ్‌లో బతకడానికి వెళ్తుంటే, ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వాళ్లతో పారిపోయాడు. చెల్లెలు పెళ్లి దగ్గర్లో ఉందని వాడికి తెలిసినప్పటికీ మళ్లీ ఇంతలో తెలిసిన మనుషులు దొరుకుతారో దొరకరో అని అప్పుడు పారిపోయాడు.

అట్లాంటి రెండు కుటుంబాల మధ్య పెళ్లి సంబంధం కుదిరిందంటే కొండడు కర్రలు కోసే మిషన్ దగ్గర కొలువు చేస్తున్నట్టు ఊళ్లో ప్రచారం కావటమే కారణం. తండ్రికి అప్పుడప్పుడు డబ్బు పంపిస్తున్నాడు. అక్కడ నుండి వచ్చే వాళ్లతో తండ్రికి బట్టలు, చెప్పులు, టార్చిలైటు, గొడుగు, కంబళీల్లాంటివి కూడా పంపిస్తున్నాడు.

పోతే సాయికి వచ్చిన రెండు మూడు పెళ్లిసంబంధాలు మారుమనువు సంబంధాలు. ఆ పెళ్లి సంబంధాలు కన్నా కొండడు సంబంధం సాయికి నచ్చింది.

'సాయి శానా పెంకిదిరా సిన్నన్నా, అప్పుడు ఒదిన నీళ్లాడిందని కబురు తెలిసి ఎల్నాను. ఇంకా యీ సమ్మందం ఊసు రాలేదులే. ఏమయింది యిన్నావా. పెద్ద రైతు సిన్న తమ్ముడు లేడా. యిసాకపట్నంల సదవతన్నాడు. ఆడొకసారి సెరుకుతోటకాడ ఎదరయి దాని సెయ్యి పట్టినాడట. ఈ గుంట ఏం సేసిందో యెరికా — సెయ్యి కొరికేసిందట.' అని సాయి కబుర్లు చెల్లెలు చెపుతుంటే కొండడు చాల ఇష్టంగా వింటున్నాడు.

ఆ ఊళ్లో పెద్ద రైతులు ఎలాంటి వాళ్లో కొండడికి తెలిసిందే. వాళ్ల చేతుల్నించి ఆడవాళ్లు తప్పించుకోవటానికి భగవంతుడే చక్రం అడ్డువేయాలి. పెళ్లయి కాపరానికి వచ్చిన నెలరోజులకే పద్మనాభం పెళ్లాం నూతిలో పడిచచ్చిపోయింది. అప్పుడు చిన్ననాయుడు పేరు అంతా చెప్పుకున్నారు. వాడిని ఊళ్లో వాళ్లు కర్రి ఆబోతు అని పేరు పెట్టారు.

పొయ్యి ముందు కూర్చుని సావిత్రి పొయ్యిలో తడిసిన తొక్కు, పిడకలు పెడుతున్నది. పొగ. అన్నం ఉడుకుతున్నది. ఓ పక్క పులుసు మరుగు తున్నది.

కొండడు టీ తాగి మళ్లీ బీడీ వెలిగించాడు. చలిపోయి, మంటవేడికి చిరు చెమట పట్టింది. ఒంటిమీది బనీను తీసేయాలనిపించింది. లేచి బనీను తీసేసి తొలుగు మీద వేశాడు. సిన్నన్న ఒళ్లు చూసింది సావిత్రి. కండలు తేరిన ఒళ్లు. మీసాలు నల్లబడ్డాయి. అంతా అయ్యపోలికే. అయ్యని చూసినట్టే అనిపించింది. ఆ పొడవైన

ముఖం. ఆ వెడల్పాటి నుదురు. ఆ కళ్లు. చిన్నప్పుడు అయ్య సిన్నన్నలాగే ఉండొచ్చు.

ఆ మధ్య సావిత్రితో ఎవరో అన్నారు, 'నీ మొగుణ్ణి ఫలానా ఊళ్లో చూశాను. ముందులాగ ఉన్నడనుకున్నావా? మనిసి గట్టి పడ్డాడు. ఛాతి మూరడున్నాది' అన్నని చూసినప్పుడు తండ్రిరూపం కనిపించిన తర్వాత ఈ మాటలు గుర్తొచ్చాయి. మొగుణ్ణి చూడాలని ఎప్పుడూ అనుకుంటుంది. మేష్టరు గారితో చెపుతుంది, వాళ్లు ఎవరన్నా వస్తే చెప్పమని, వచ్చి చూసి వెళ్లమని, లేకపోతే తనని ఎక్కడకన్నా రమ్మంటే వస్తానని. మరి మేష్టరుగారికి వాళ్లు కలిసారో లేదో సావిత్రికి తెలీదు.

వాన తగ్గలేదు. గొడుగేసుకుని మేష్టరుగారి భార్య వచ్చింది. 'సావిత్రీ నీ కూతురు ఇంకా నిద్ర పోతున్నదా' అని తిన్నగా ఆ పాప దగ్గరికే పోయి ఎత్తుకుని వచ్చింది. ఇంట్లో కొత్తమనిషిని చూసి పంతులమ్మ ఆగిపోయింది.

'మా సిన్నన్న. అస్సామ్‌లో ఉన్నాడన్నాను, ఆడు.' అని కొండడు గురించి చెప్పింది సావిత్రి.

కొండడు ఇంట్లోంచి బైటికి వచ్చాడు. ముసలమ్మ చుట్ట కావాలన్న సంగతి గుర్తొచ్చింది. వెళ్లి తేవాలి. ఎక్కడ అమ్ముతారో చెల్లెల్ని అడగాలను కున్నాడు. లోపలికి వెళ్లాలనుకుని చూస్తే, వచ్చిన మేష్టరుగారి భార్య పాపకు రొమ్ము కుడిపింది. పాపకి తల్లి పాలు చాలవు. మేష్టరు గారి భార్యకి ఎక్కువ. రోజూ వచ్చి రెండుసార్లు పాలిచ్చి పోతుంది. ఉదయం ఓసారి. రాత్రి ఓసారి. ఆ పాలే లేకపోతే పాప బతకటం కష్టమయ్యేది. మేష్టారుగారు వారానికీ పదికీ ఓసారి వచ్చి కొంచెంసేపు కూర్చుని మాటాడిపోతారు. ఇంట్లో కష్టంగా ఉంటే సహాయం చేస్తారు. ఊళ్లో పెద్దమనుషులకి ఇది కంటగింపుగా ఉంది. అయినా బైట పడలేకపోతున్నారు. ఏం చేస్తే నక్సలైట్‌లు వచ్చి తలకాయ కోసి వేలాడగట్టారో అని భయపడుతున్నారు. పైగా ఆ మేష్టరుకి ఆ నియోజక వర్గం ఎమ్మెల్యేతో బంధుత్వం ఉంది. పోలీసు అధికార్లతో ఆయనకి స్నేహం ఉంది. మేష్టరు పెద్ద కుటుంబం నించి వచ్చిన వాడు. మామూలు మేష్టరే అయితే ఎప్పుడో అరెస్ట్ చేయించి జైల్లో పెట్టించే వాళ్లే. కాని ఈ మేష్టరు దొరకడు. ఊళ్లో కొందరు పెద్దరైతులు కొత్తగా వచ్చిన పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని కలుసుకుని పెద్ద మొత్తం లంచం ఇచ్చి ఆయన్ని అరెస్ట్ చేయించటానికి ప్రయత్నించారు. అంతలో పోలీసులకీ ఆ పెద్దమనుషులకీ మధ్య గొడవొచ్చి సంబంధం బెడిసిపోయింది. ఒక పెద్దరైతు కోడలిని పోలీసులు మానభంగం చేశారని అప్పట్లో జనం చెప్పుకున్నారు. వెంటనే హైద్రాబాద్ వెళ్లి, హోమ్ మంత్రిమీద ఒత్తిడి తెచ్చి, చాలా డబ్బు ఖర్చుపెట్టి ఊళ్లో ఉన్న పోలీస్ కేంప్‌నే తీసేయించారు.

మేష్టరుగారి భార్యకు తొలికాన్పు నాలుగు నెలల కొడుకు. ఆమె పొడవైన మనిషి. పొడుగుకి తగిన లావు. అందమైన రూపం. మంచి మనసు. సన్నగా పెద్ద కళ్లు. పల్చటి కనురెప్పలు. సన్నటి అందమైన ముక్కు. పొడవైన మెడ. చామన చాయ రంగు. పెద్ద యింటి ఆడ పడుచు, పెద్దయింటి కోడలు కావటంతో ఆమె చెయ్యి పెద్దది. ఎవరికి ఏది ఇచ్చినా నిండు మనసుతో ఇస్తుంది.

'మా సిన్నన్నకు పెళ్లి మేష్టారమ్మా.'

'ఎప్పుడు.'

కొండడు కలిగించుకుని బైటనుండి 'దాన్ని తీసికెల్దానికే నేనొచ్చినా నండి' అన్నాడు.

అన్నం ఉడికింది. గంజి వార్చటానికి వెళ్లింది సావిత్రి. మేష్టరు గారి భార్య పాపకు పాలు ఇస్తున్నది.

బీడీ పొగవాసనతో ముసలమ్మకు చుట్ట గుర్తొచ్చింది.

'నాయినా నీ పేరేమిటన్నావ్' ముసలమ్మ అడిగింది.

'కొండడు.'

'నాయినా నోరంతా సేదు సేదు గున్నాది. సుట్ట అడిగినానని ఏమను కోకు. మిల్లు డైవేరు అప్పుడప్పుడొచ్చి సుట్ట లిస్తాడు. ఈ మద్దిన రాలేదు నాయినా' అని చెప్పి, మరోసారి తన మాట గుర్తు చేసింది ముసలమ్మ.

'అత్తా, ఈ వూర్లో సుట్ట లెక్కడమ్ముతారత్తా? సెప్పు. ఎల్లి తీసికొస్తాను.'

'ఎదురువాసల నాలుగిల్లు దాటితె పెంకుటిల్లున్నాది నాయినా. అక్కడ అమ్ముతార్నాయినా. పెద్ద సుట్ట తీసుకురా నాయినా, సిన్న దొద్దు' అని ముసలమ్మ తనకు కావలసిన రకం చుట్ట గురించి మనసులోని మాట చెప్పేసింది.

గొడుగు తీసుకుని వీధిలో అడుగుపెట్టాడు. ఆ పెంకుటిల్లు కనిపిస్తూనే ఉంది. ఆ ఇంటి వరండాలో గజానికి లాంతరు వేలాడుతున్నది.

కొండడు వీధిలో ముందుకు పోతుండగా తలమీద తాటి గొడుగుతో ఓ కుర్రవాడు పరుగునడకతో వచ్చాడు. తాటిగొడుగు పంచలో అరుగుకు ఆనించిపెట్టి ఇంటి లోపలికి వెళ్లాడు. మేష్టరుగారి భార్య గోడకి చేరగిలబడి నేలమీద కూర్చుని పాపకు పాలు పెట్టున్నది, ఎవర్నీ పట్టించుకోకుండా. ఆ కుర్రవాడు పొయ్యి దగ్గర గంజి వారుస్తున్న సావిత్రి దగ్గరకు వెళ్లి 'సాయిత్తిరప్పా మీ యింటికి కొత్త మనిషి ఎవళ్లేనా వొచ్చినారా?' అని చిన్న గొంతుతో భయం భయంగా అడిగాడు.

వాడు ఊరుకు తూర్పుగా ఉన్న రైస్ మిల్లులో కళాసీ. ఆ మిల్లు పక్కనించే

రోడ్డుకు పోయే బండిదారి. అక్కడకు రోడ్డు కిలోమీటరు దూరం. రోడ్డుమీద మరొక కిలోమీటరు దూరంలో నక్సలైట్‌ల కోసం పోలీస్ కేంప్. మిల్లు డ్రైవర్‌కి, పోలీసులను వెంటనే తీసుకురమ్మని ఊరి పెద్దమనుషులు ఎవర్నో పంపినట్టు తెలిసింది. డ్రైవర్‌కు అనుమానం వచ్చి 'కనుక్కుని రారా' అని కళాసీని సావిత్రి ఇంటికి పంపించాడు. దొంగచాటుగా వేరే వీధిలోంచి వచ్చాడు వెంటనే. గుట్టు చప్పుడుకాకుండా మళ్లీ వెళ్లిపోవాలి. మిల్లు దగ్గర పని. పగలంతా కరెంటు లేదు. గంటక్రిందటే వచ్చింది. రాత్రంతా సరిపోయేంత పని ఉంది. ధాన్యం బస్తాలు పడి ఉన్నాయి. ఐదారుగురు రైతులు తమ పనికోసం మిల్లుకాడే ఉన్నారు.

'మా సిన్నన్న తమ్ముడూ' అని సావిత్రి 'సిన్నన్నా' అని బైటికి వినిపించేట్టు పిలిచింది.

'అస్సామ్‌లో ఉన్నాడన్నాను సూడు, ఆడు. గడపలో నిలబడున్నాడు... ఆడికి పెళ్లి. పిలుపు సేయడానికొచ్చినాడు తమ్ముడూ, అయ్య తోల్నాడు తమ్ముడూ. యీ బుదోరమే పెళ్లి.'

కళాసీ పిల్లవాడు గుండ్రంగా నల్లగా గుండురాయిలా ఉన్నాడు. తల గుండు కొట్టించాడు. కుడిచేతి భుజానికి తాయెత్తు కట్టించాడు. పొట్టి కాకి నిక్కరు తప్పించి ఒంటి మీద వేరే గుడ్డలేదు. పద్నాలుగేళ్లు నిండీ నిండని వయస్సు.

'అది కాదు సాయిత్తి రప్పా. పోలీసోళ్లని పిలిసికి రాడానికి ఎల్నారు. మీ యింటికి ఎవళేనా కొత్త మనిషి వొచ్చుంటే సెప్పు' అని మరోసారి వివరంగా అడిగాడు.

వాడికి సావిత్రి చెప్పిన ఆమె చిన్నన్న కొండడు గడపలో కనిపించలేదు. తన దగ్గర నిజం దాచుతున్నదేమోనన్న అనుమానంతో మళ్లీ అడిగాడు.

'నిజం తమ్ముడూ. కొత్త మనిషెవళూ కాదు తమ్ముడూ. మా సిన్నన్న. ఆడి పెళ్లికి దేశం నించి వోరం రోజులయిందేమో వొచ్చినాడు తమ్ముడూ'

'మరయితే బయం లేదా?'

సావిత్రి మాటాడ లేకపోయింది.

'మరెక్కడయినా వున్నారా?'

సావిత్రి ఏం చెప్పలేకపోయింది. ఆమెకి ఆ సంగతి తెలీదు.

మంట ఆరిపోయింది. కాల్చటానికి తెచ్చి పెట్టిన ఉప్పు చేపను నిప్పుల మీద పెట్టింది. దాంతో ఎండు చేప కాలుతున్న వాసన.

'పోలీసోళ్లయితే ఎలిపొస్తన్నారు. బయ్యం లేదని సెప్పెస్తాను సరేనా' అని కళాసీ కుర్రవాడు ఇంట్లో మనుషుల్నెవరినీ చూడకుండా తాటి గొడుగును అందుకుని

నెత్తిన పెట్టుకుని వచ్చిన దార్నే వెళ్లిపోయాడు.

'సావిత్రీ, నా తోటిరా. మీ తమ్ముడొచ్చినాడు కదా, ఇంట్లో బీరకాయ కూర ఉన్నాది. ఇస్తాను రా, బయల్దేరు' అని పాపని సావిత్రి చేతికిచ్చింది. సావిత్రి పాపని ముసలమ్మ దగ్గర పెట్టి మేష్టరమ్మతో బైటికి వెళ్లింది.

కొండడు తిరిగి వచ్చేసరికి సావిత్రి ఇంట్లో లేదు. తనుకొనుక్కుని వచ్చిన పాటాకు పెద్ద చుట్టలు నాలుగు ముసలమ్మ చేతిలో పెట్టి, అగ్గిపెట్టె తీసి ఒకటి ఆమె వెలిగించుకోవటానికి పుల్లగీసాడు. ముసలమ్మ చుట్ట పొగ నోటి నిండా పీల్చి 'కమ్మగా సుకంగా పెల్లం పిల్లలతో బతుకు నాయినా' అని దీవించింది. ఆమె చూపు పోయి రెండు మూడేళ్ల నుండి ఇట్లా అరుగుమీద కూర్చునే గడుపుతున్న సంగతి తండ్రినోట విన్నప్పటికీ ఇప్పుడు చూస్తేనేగాని ముసలమ్మ అవస్థ అర్థం కాలేదు.

'నాయినా, ఇవినాకు వారం పది రోజులొస్తాయి'

'రేపు పగలు, చూసి మళ్లీ మంచిగ వుంటే మరి కసిన్ని కొంతాన్లే అత్తా' అని కొండడు చెప్పేసరికి ముసలమ్మ మరింత సంతోషపడిపోయింది.

వర్షం పూర్తిగా తగ్గిపోయినప్పటికీ ఆకాశంలో మేఘాలు మాత్రం దట్టంగా ముసురుకుంటూనే ఉన్నాయి. మళ్లీ పెద్దజల్లు కురిసేట్టుగా ఉంది. గాలి జోరు తగ్గింది కాని చలిమాత్రం తగ్గలేదు. బీడీ చలిని ఆపేట్టు లేదు. చెల్లెలు కోసం వెతికాడు. ఇరుగింటికో పొరుగింటికో వెళ్లినట్టుంది. ముసలమ్మ చుట్టపొగకి పాప ఏడుస్తున్నట్టుంది. ముసలమ్మ చేతినుండి పాపని తీసుకున్నాడు. పాప ఏడుపు మానేసింది.

అంతలో చెల్లెలు రెండు స్టీలు గిన్నెల్లో మేష్టరు గారి భార్య ఇచ్చిన కూరా పప్పూ తీసుకుని వచ్చి, 'సిన్నన్నా ఎక్కడి కెల్నావురా?' అని అడిగింది.

మిల్లు కళాసీ తమ్ముడు వచ్చి వెళ్లిన సంగతి చిన్నన్నతో చెప్పాలో మానాలో సావిత్రికి తెలియలేదు. చివరికి సావిత్రి తనలో దాచుకోలేక పోయింది. చెప్పింది. సావిత్రికి ఎన్నెన్నో భయాలు ముసురు కొచ్చాయి. నిజంగానే తన భర్త వీరేశు వచ్చి ఎక్కడన్నా ఎవరింట్లోనన్నా దాక్కుని ఉన్నాడేమో. రమ్మని కబురు చేయమని చాలసార్లు మేష్టారుతో చెప్పింది. తనను చూసి పోవాలని ఊరు వచ్చాడేమో. లేక ఇంకెవరినన్నా చూసి రమ్మని పంపించాడో ఏమో. వేరెవరన్నా తమ ఇంటికి వచ్చి ఎక్కడన్నా వేరే ఇంట్లో ఉన్నారో ఏమో. మేష్టారుగారితో ఈ సంగతి చెప్తే ఆయన ఏం చేయాలో చెప్పేవాడు. అయితే మేష్టరు గారు ఊళ్లోలేదు. పనిమీద బరంపురం ఈ మధ్యాహ్నమే వెళ్లినట్టు, రేపు సాయంత్రం తిరిగి వస్తున్నట్టు తెలిసింది.

ఆ సమయాన సావిత్రికి చిన్నన్న నక్సలైట్ లాగ కన్పించాడు. వాడినే నక్సలైట్ అని తీసుకుపోతేనో. పెద్దన్నని తీసుకుపోయి పెట్టిన చిత్రహింసలు ఆమెకు గుర్తు వచ్చి భయంతో ఒళ్లు చెమటపట్టేసింది. తమకు అనుమానం వచ్చిన వాళ్లనే కాకుండా, ఊళ్లో పెద్ద నాయుడుకి పదనివాళ్లనికూడా పోలీసులు తీసుకెళ్లారు. వాళ్లని విడిపించుకోవటానికి తల్లుల మెడల్లోని, పెళ్లాల మెడల్లోని బంగారాలు అమ్ముకోవలసి వచ్చింది. నాయకుల చుట్టూ, ప్లీడర్ల చుట్టూ తిరగవలసి వచ్చింది. పోలీసులు ఇంటిమీద పడి అమాయకుల్ని తీసికెళ్లిన దృశ్యాలు భయపెట్టాయి. ఎక్కడన్నా చిన్నన్నని దాచేయాలి. ఆ సంగతి మేష్టరమ్మతో మాట్లాడి రావాలని మళ్లీ బైట పడింది. తండ్రి మీద కోపం వచ్చింది. పిలుపు కోసం చిన్నన్నను ఎందుకు పంపించాలి.

కొండడికి ఏమి తోచటం లేదు. అన్నను కొట్టిన కథంతా పదే పదే గుర్తొస్తున్నది. అడవుల్లోకి తీసుకుపోయి, చెల్లెలు భర్త, బావ వీరేశు ఎక్కడున్నాడో చెప్పమని, చెప్పకపోతే చంపుతామని కొట్టిన సంగతి గుర్తొస్తుంటే భయంగా ఉంది. మళ్లీ అంతలోనే ధైర్యం. వాడు అస్సామ్‌లో కఱ్ఱలమిల్లులో పని చేసుకుంటున్నాడు. వాడు పెళ్లి చేసుకోవటం కోసం ఈ సారి వచ్చాడు. పెళ్లి పిలుపు కోసం చెల్లెలు దగ్గరకు ఈ ఊరు వచ్చాడు. ఈ నిజం చెప్తే వాళ్లు అర్థం చేసుకుంటారు. ఎందుకు భయపడాలి. అయినా వాళ్లు వస్తున్నది తన కోసం కాదేమో. అనవసరంగా భయపడుతున్నాడేమో. వేరేవాళ్లు ఎవరన్నా —నక్సలైట్లు —వచ్చి ఊళ్లో ఉన్నారేమో. తనని తనే సమాధాన పరుచుకున్నాడు. పాపని గుండెకు హత్తుకుని ధైర్యం తెచ్చుకున్నాడు.

పాపకి కొత్త. ఏడవటం మొదలు పెట్టింది. నిద్రకూడానేమో. ఎంత బుజ్జగిస్తున్నా ఊరుకోదు. గొంతు చించుకుని ఏడుస్తున్నది, గుక్కపట్టి ఏడుస్తున్నది.

సావిత్రి అలికిడి వినిపించక పోయేసరికి 'సాయిత్తిరి ఎక్కడికెల్లింది నాయినా?' అని ముసలమ్మ అడిగింది.

కొండడు ఏమీ చెప్పలేక పోయాడు.

'ఈ రాత్రికాడ, వచ్చిన పిల్లడికి తిండి పెట్టకుండా ఇది ఎక్కడికెలిపోయిందో!' అని గొణుక్కుంది ముసలమ్మ.

మళ్లీ వాన మొదలయింది.

ముందు అక్కడినించి పారిపోవాలనిపించింది కొండడికి. ఎంతగా ధైర్యం చెప్పుకుంటున్నా మనసు కీడెంచుతూనే ఉంది. ఎటు పారిపోవాలి? ఊరు కొత్త. పైగా వాన. చీకటి రాత్రి. వాడికి ఆ ఊళ్ళో వీధులు తెలీవు. పొలాల్లో దమ్ములవుతున్నాయి.

పొలాల్లో నిండా నీళ్లు. గెడ్డలూ, వాగులూ పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండిపోయాయి. ఎటుపోతే రోడ్డో ఆ ఊళ్లో. తెలిసిన వాళ్లు కూడా ఎవరూ లేరు. ఎటు ఏ దిక్కో. ఎటు తూర్పో, ఎటు పడమరో తెలీదు. ఆకాశాన వర్షపు మేఘాలు. మెరుపులన్నా మెరవటం లేదు. సావిత్రి ఎక్కడికి వెళ్లిందో కనిపించదు. పాప ఏడుపు. పోలీసులు వస్తున్నారా? నిజమేనా? తనకోసమేనా? అస్సామ్‌లో తను పనిచేస్తున్న రంపపు మిల్లు. దాని గుజరాతీ యజమాని. అక్కడ వందలాది మంది పనివాళ్లు. ఆ స్నేహితులు. పెళ్లి అయిన వారం రోజుల్లోనే తిరిగి వెళ్లిపోవాలనుకున్న ప్రయాణం. ఊళ్లో సాయి. సాయితో పెళ్లి. బుదోరం రాత్రి పెళ్లి. పోలీసులు వస్తారా? సాయిత్తి రేదీ? పారిపోతే? ఊళ్లో జనమే పట్టుకుంటే? దాక్కోవాలి. సాయిత్తిరీ — సాయిత్తిరీ—

సావిత్రి వచ్చింది. ఆమెతో ఎవరూ రాలేదు. వెనక వస్తున్న ఎవరో మనిషి ఆగి వెనక్కి అడుగువేశాడు. దూరంగా నల్లని మేఘం నడిచి వస్తున్నట్టు పోలీసులు. సావిత్రి ఇంట్లో అడుగుపెట్టి చిన్నన్న చేతుల్లోంచి పాపను అందుకునేసరికి వాకిట్లో పోలీసులు. టార్చిలైట్లు. బురదలో అడుగుల చప్పుడు. కాకీ దుస్తులు. బరువైన తుపాకీలు. మెరుస్తున్న బయినెట్లు. ఒకరు కాదు ఇద్దరు కాదు. పది పన్నెండు మంది. వాళ్లు మనుషులు కాదు. వాళ్లు ప్రభుత్వం. వాళ్లు ఆయుధాలు. వాళ్ల బూట్లచప్పుడు తప్పించి ఇంకొక శబ్దం లేదు. తడిచి వచ్చారు.

బయినెట్‌తో ఉన్న ఒక తుపాకి సావిత్రిని పక్కకి నెట్టింది.

కొన్ని తుపాకులు వర్షంలోనే బైట కాపలా కాస్తున్నాయి. కొన్ని తుపాకులు ఇంట్లో దూరాయి, చుట్టు ముట్టాయి.

'నేను కొండడిని.'

'నేను మా సెల్లెల్ని... పెళ్లికి పిలడానికి వొచ్చినాను. బుదోరం రాతిరి నా పెళ్లి' ఏడుపు గొంతుతో చెప్పాడు కొండడు.

'నేను అస్సామ్ సామిల్లుల కళాసీ ఉద్యోగం సేసికుంతన్నాను. నాకు...' ఏడుపు గొంతుతో బతిమాలుకుంటున్నాడు కొండడు.

'నేను కాను, నేను కాను'

ఆ భాషే అర్థం కానట్టు, ఆ ఘోషే వినిపించనట్టు ఉక్కు టోపీలు, బయినెట్లు మాట్లాడలేదు.

కొంతసేపటికి ముసలమ్మా, సావిత్రీ, పసిపాప ఇంట్లో మిగిలారు. కొండడిని తీసుకుని ఉక్కుటోపీలు వర్షంలోనే బైటికి వెళ్లిపోయాయి.

* * *

ఆ రాత్రే కొండడిని ఊరుకు తూర్పున మిల్లు దాటిన తర్వాత మర్రి చెట్టు కింద పోలీసులు కాల్చేసారు. ఆ శవాన్ని తమతోనే పోలీసులు తీసుకుపోయారు. చంపేసినట్టుగా ఆ రాత్రే సావిత్రికి తెలిసింది. ఆమె గుండెబాదుకుని తల నేలకి కొట్టుకుని ఏడ్చింది. ఊళ్లో ఇరుగు పొరుగు జనం వచ్చి సావిత్రిని పట్టుకున్నారు. ఊళ్లో జనం అందరికీ ఆ రాత్రే ఈ సంగతి తెలిసింది. ఎవరు చేయించిందో కూడా తెలిసింది. ఎందుకు చేయించిందో కూడా వాళ్లకు తెలిసింది. ఈ రకంగా ఎంతకాలం జరుగుతుందో మాత్రం వాళ్లకి తెలీలేదు. ఇలా ప్రాణాలు తీయడాన్ని న్యాయమే అంటారో, చట్టమే అంటారో, పరిపాలనే అంటారో, అధికారమే అంటారో, ప్రభుత్వమే అంటారో, అరాచకాన్ని అరికట్టడమే అంటారో, శాంతి భద్రతలు కాపాడ్డమే అంటారో, జనానికి ఎంతకీ అర్థం కాలేదు. కన్నీళ్లకళ్లు తుడుచుకున్నారు. బగమంతుడా అనుకున్నారు.

* * *

ఆ పగలు దమ్ము పొలంలో వరినాట్లు పనిలో ఉన్న పారమ్మ, గౌరమ్మ, తవుడు, కన్నమ్మ, అప్పలమ్మ, గరికమ్మ, నూకాలు, పెంటమ్మ, బోడి, సుబ్బ, సీత, జానకమ్మ, రత్నాలు, సాయమ్మ, దానమ్మ —ఎవరినోటికి వచ్చిన తిట్లు వాళ్లు తిడుతున్నారు.

ఈ ఊర్లో రాచ్చసులు ఎప్పుడు చస్తారో. ఆల్లకి కాలం ఎప్పుడు నిండుతాదో. ఆల్ల తలలెప్పుడు బద్దలవుతాయో. ఆల్ల పెల్లాల పుస్తెలెప్పుడు తెగుతాయో. ఆల్ల కుదుళ్లు ఎప్పుడు కూల్తాయో. ఏ పెద్దమ్మోరొచ్చి ఆల్లని నొల్లేస్తాదో.

ఒక చెల్లెలంది 'రావణ బెమ్మే సచ్చినాడు, యీళంతా యెంత'.

'జ్యోతి' మాస పత్రిక
*నవంబర్ 1970*

* * *